సాక్షి సూర్యాపేట
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



అసోసియేషన్‌లో విభేదాలు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికపై తీవ్ర గందరగోళం ఏర్పడింది.

- 8లో



అతి పెద్ద ఆర్థిక శక్తిగా భారత్

భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని ఐసీఎస్ఎస్ఆర్ హైదరాబాద్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు.

- 8లో



పోలీస్ బందోబస్తు భేష్

దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో పోలీస్ బందోబస్తు బాగుందని మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

నీటి ఎద్దడి తలెత్తవద్దు

• కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



ఇమాంపేటలో నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట: జిల్లాలో వచ్చే మూడు మాసాల్లో ఎక్కడ కూడా నీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మండలం ఇమాంపేటలోని మిషన్ భగీరథ నీటిశుద్ధి 90ఎంఎల్‌డీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటిశుద్ధి కేంద్రం పరిధిలోని రెండు మున్సిపాలిటీలు సూర్యాపేట, కోదాడ, మండలాలు చిలుకూరు, కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్, సూర్యాపేట పరిధిలోని గ్రామాలు, ఆవాసాలు, విలీన ఆవాసాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వేసవిలో నిరంతరం జరగాలన్నారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్‌రెడ్డి, గ్రిడ్ ఈఈ శ్రీనివాసరావు, ఇంట్రా డీపీఓ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈ రాజేందర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఉచిత న్యాయసేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి

చివ్వెంల : ప్రజలు ఉచిత న్యాయసేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి కోరారు. పెద్దగట్టు జాతరలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి మాట్లాడారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని దీనివల్ల ఇరువర్గాల వారు గెలిచిన వారవుతారన్నారు. సమయం, ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణపిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

హుజూర్‌నగర్ : ఈ నెల 27 న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని పలు పాఠశాలలను సందర్శించిన అనంతరం హుజూర్ నగర్ టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సిరెడ్డి మాత్రమే ఆరేళ్లుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు జెట్టి కమల, ఆర్. దామోదర్, చెన్న సైదులు, బాల సైదిరెడ్డి, శ్రీమన్నారాయణ, చిరంజీవి, గోవింద శీను, వి. రామకృష్ణ, ప్రభాకర్ రెడ్డి, చిక్కుళ్ల గోవిందు, ఆర్ . రామకృష్ణ, లక్ష్మీకాంత్, శ్రీనివాస రెడ్డి, స్రవంతి, జ్యోతి, కిరణ్ బాబు, చంద్రశేఖర్, సైదులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా సారథిగా మహిళకు అవకాశం



శ్రీలత రెడ్డి

హుజూర్ నగర్ : బీజేపీ జిల్లా సారథి పదవి మహిళకు దక్కింది. హుజూర్ నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ చల్లా శ్రీలత రెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె బీజేపీ తరఫున హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆమె నిబద్ధతను గుర్తించిన అధిష్టానం జిల్లా పార్టీ బాధ్యతలను అప్పగించింది.

ఈ చిత్రంలో పశువులు మేస్తున్న పొలం పెన్‌పహాడ్ మండలం నూర్‌జహాన్‌పేట తండాకు చెందిన భూక్యా బాలకోటి సాగు చేసింది. ఎస్సారెస్పీ కాలువ కింద చిన్నపాటి బోరును ఆధారంగా చేసుకుని ఎకన్నరం పొలం దున్ని నాటు పెట్టాడు. నాటు పెట్టిన తర్వాత నీళ్లు రాకపోగా బోరు సైతం అడుగంటింది. దీంతో పొలం ఎండిపోసాగింది. ఎస్సారెస్పీ నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో గుండుగుత్తగా రూ.4500లకు పశువుల మేత కోసం అమ్మాడు. ఇదీ ఈ ఒక్క రైతుదే కాకుండా ఎస్సారెస్పీ ఆయకట్టు కింద చాలామంది రైతులది.



జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని చెప్పడానికి ఉదాహరణ ఈ బావి. నడిగూడెం మండలం వేణుగోపాలపురం వద్ద యాసంగి సమీపిస్తుండగానే అడుగంటిపోయింది. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని బోరుబావుల్లోనూ ఉంది. ఈ వానాకాలం సమృద్ధిగా వర్షాలు, రికార్డుస్థాయిలో వరదలు వచ్చినా గతంలో ఏనాడూ లేనివిధంగా భూగర్భ జలాలు పడిపోయి బోరు బావుల్లో నీరు లేకుండా పోయింది.



ఆయకట్టు ఎండుతోంది..

ఎస్సారెస్పీ కాల్వకింది భూములకు అందని గోదావరి జలాలు

• నామమాత్రపు నీటి విడుదలతో 50వేల ఎకరాలు దాటని వరి సాగు

• ఎండలు ముదిరి నీటి వాడకం పెరగడంతో ఎండుతున్న పొలాలు

సూర్యాపేట : అడుగంటిన భూగర్భ జాలలు.. వట్టిపోయిన బోర్లు.. నీటిపారుదల శాఖ అధికారుల ఉదాసీనత.. అరకొరగా విడుదల చేసిన నీరు అందకపోవడం.. వెరసి ఎస్సారెస్పీ ఆయకట్టులో వరిపొలాలు ఎండిపోతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి యాసంగిలో సాగు చేసిన పంట ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎండిపోయిన పొలాల్లో పశువులను మేపుతున్నారు. ఈ ఆయకట్టు కింద 2.20లక్షల ఎకరాల విస్తీర్ణం ఉన్నా సాగు 50వేల ఎకరాలు కూడా దాటలేదు.

ఎస్సారెస్పీ రెండో దశ కింద..

శ్రీరాంసాగర్ రెండోదశ కింద సూర్యాపేట జిల్లాలో 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు నీరందించేందుకు 69, 70, 71 డీబీఎం(డిస్ట్రిబ్యూటరీ మేజర్)లు ఉన్నాయి. ఇందులో 71 డీబీఎం పెద్దది. 69 డీబీఎం తిరుమలగిరి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో 27కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది. దీనికింద 60,572 ఎకరాల ఆయకట్టు ఉంది. 70 డీబీఎం నాగారం, తిరుమలగిరి మండలాల్లో 9కి.మీ మేర విస్తరించి ఉంది. దీనికింద 7వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 71డీబీఎం తిరుమలగిరి, అర్వపల్లి, నాగారం, సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్, మోతె, మునగాల, నడిగూడెం మండలాల్లో 68.45కి.మీ మేర విస్తరించి ఉంది. దీనికింద 1,42,230 ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రధాన కాలువల వెంటనే సాగు..!

69వ డీబీఎం కింద 60వేల ఎకరాల ఆయకట్టు ఉండగా.. 28 ఉపకాల్వలు, 70వ డీబీఎం కింద 7వేల ఎకరాలకు గాను 11 ఉపకాలువలు ఉన్నాయి. ఇక 71 డీబీఎం కింద 1,41,230 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. 75 ఉపకాలువలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాకు వదులుతున్న గోదావరి జలాలు ప్రధాన కాలువలు తప్పా ఎక్కడా ఉపకాలువల్లోకి వెళ్లని పరిస్థితి. నీటి విడుదల మొదలు ఇదే పరిస్థితి ఉండడంతో చాలామంది రైతులు సాగు చేయలేదు. దీంతో కేవలం 50వేల నుంచి 60వేల ఎకరాల్లోనే సాగు చేశారు. కొందరు కొద్దిపాటి బోరుబావుల కింద ఈ నీటిని నమ్ముకుని సాగు చేసినా ప్రస్తుతం ఆ పొలాలు ఎండిపోయే దశకు చేరాయి. గతంలో రోజుకు 1800 నుంచి 1900 క్యూసెక్కుల నీటిని రెండోదశకు విడుదల చేసేవారు. దీంతో మూడ్రోజుల్లోనే చివరి ఆయకట్టు భూములకు ఈ నీరు చేరి కొన్నిచోట్ల మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు అలుగులు పోశాయి. కానీ ప్రస్తుతం 1400 క్యూసెక్కులకు మించి ఇవ్వడం లేదు. దీంతో ఏ డీబీఎంలోనూ చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి. జనవరి 1వ తేదీ నుంచి జిల్లాకు నీటిని విడుదల చేస్తుండగా.. ఇంతవరకు 71 డీబీఎం పరిధిలోని మోతె, నడిగూడెం మండలాల చివరి భూములకు నీరు చేరనేలేదు. అసలు పైభాగంలో ఉన్న అర్వపల్లి మండలంలోనూ పంటలు ఎండిపోతున్నాయంటే ప్రభుత్వం ఏ మేరకు నీటిని విడుదల చేస్తుందో అర్థం చేసుకోవచ్చని రైతాంగం చర్చించుకుంటోంది.



ఆత్మకూర్ (ఎస్)లో నీళ్లు లేక నెర్రెలువారిన వరిపొలం

ఆయకట్టుపై పట్టింపేది..?

కారణం ఏదైనా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఈ ప్రాంతానికి గోదావరి జలాలు కరువయ్యాయని రైతాంగం భావిస్తోంది. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి రాగా కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే నీరిచ్చారు. ఇక 2024 వానాకాలం సీజన్‌లో పుష్కలంగా నీరున్నా ఆలస్యంగా నీటిని విడుదల చేశారు. దీంతో చివరి ఆయకట్టుతో పాటు చాలామంది రైతులు పంటల సాగుపై ఆశలు వదులుకున్నారు. 2024 నవంబర్ మాసంలో శ్రీరాంసాగర్‌తో పాటు మిడ్ మానేరు, ఎల్ఎండీల్లోకి వరద వచ్చి గేట్లను సైతం ఎత్తారు. దీంతో వానాకాలం ఆలస్యమైనా యాసంగికి పుష్కలంగా నీళ్లొస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశారు. అయినా అటు పాలకులు, ఇటు నీటిపారుదల శాఖ అధికారుల తీరుతో 2.30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ ప్రాంతానికి నీటిని విడుదల చేయడంలో పట్టింపు లేకుండా ఉన్నారు.

2025 జనవరినాటికి ఎస్సారెస్పీ ఆయకట్టు మండలాల్లో భూగర్భ జలాలు

మండలం	మీటర్లలోతుల్లో
తిరుమలగిరి	16.71
తుంగతుర్తి	4.15
మద్దిరాల	4.09
నూతనకల్	3.77
నాగారం	1.55
అర్వపల్లి	7.82
సూర్యాపేట	5.99
ఆత్మకూర్	6.84
చివ్వెంల	4.58
పెన్‌పహాడ్	5.48
మోతె	2.59
మునగాల	5.24
నడిగూడెం	3.80

పంట చేతికి వస్తుందో రాదో తెలియడం లేదు



కొద్దిపాటి బోర్లతో పాటు ఎస్సారెస్పీ నీటిని నమ్ముకొని రెండు ఎకరాలు సాగు చేశాను. ప్రస్తుతం పొలం కరకు దశలో ఉంది. నీళ్లు ఇప్పుడే అవసరం. ఎండలు ముదిరాయి. ఎస్సారెస్పీ నీళ్లు రావడం లేదు. పంట చేతికి వస్తుందో రాదో తెలియదు.

అబ్బ గాని మల్లయ్య, రైతు, ఆత్మకూరు



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు కుంట్ల గోవర్ధన్‌రెడ్డి. సొంతూరు కొమ్మాల. 5 ఎకరాల భూమిలో రెండు బోర్లు, ఎస్సారెస్పీ నీటిని నమ్ముకుని వరి సాగు చేశాడు. యాసంగి నీటిని విడుదల చేసి నెల 15 రోజులైనా ఇంతవరకు ఒక్కరోజు ఈ రైతు పొలం తడిసిన దాఖలా లేదు. దీనికి తోడుగా రెండు బోర్లలో నీళ్లు పాతాళానికి పడిపోయాయి. దాదాపు రూ.2లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పొలంలో ప్రస్తుతం పశువులను మేపుతున్నాడు. ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాడు.

ఒక మడి వదిలేశాను

శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు రెండోదశకు నీళ్లు విడుదల చేస్తారంటే ఎకరం పొలం సాగు చేశా. నీళ్లు రాకపోవడంతో ఇటీవల బోరు వేసి కొద్ది నీళ్లతో నాటు పెట్టాను. ఆ బోరు కాస్త పోయడం లేదు. ఇటు నీళ్లు రావడం లేదు. దీంతో చేసేదేమీ లేక 15 గుంటల మడిని వదిలేశాను. మిగతాది చేతికి వస్తుందో రాదో తెలియదు.

–ఉప్పుల ఎల్లయ్య

సాగునీటి సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేయాలి

•కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



దాస్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట: ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ భూములకు విడతల వారీగా సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. బుధవారం సూర్యాపేట మండలం దాస్‌తండా వద్ద ఉన్న ఎస్సారెస్పీ పరిధిలోని 71డీబీఎంను పరిశీలించి మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎక్కడెక్కడ సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారో గుర్తించాలన్నారు. ఆయా ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ సాగునీరు సరఫరా చేయాలని సూచించారు. మొదటి మూడు రోజులు ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట, చివ్వెంల మండలాలకు, తదుపరి మూడు రోజులు మోతె, పెన్‌పహాడ్, నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని భూములకి సాగునీరు అందించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. డీబీఎం 22 ద్వారా మోతె మండలానికి సాగునీరు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల సీఈ రమేష్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ శ్రీనివాసరావు, డీఈ రమేష్, ఏఈలు ఉదయ్, లింగయ్య, పాండు పాల్గొన్నారు.

నెలవారం.. జనహోరం

• భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
• కేసారం చేరిన దేవరపెట్టె
• నేడు జాతర ముగింపు

చివ్వెంల, సూర్యాపేటటౌన్ : పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో నాలుగోరోజు కూడా భక్తుల కోలాహలం నెలకొంది. బుధవారం నెలవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. లింమంతుల స్వామిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ సందర్శించి పూజలు చేశారు. గురువారం మకర తోరణం తరలింపుతో జాతర ముగియనుంది.

దేవరపెట్టె తరలింపు


జీవాలను పరిరక్షించిన దేవతగా అవతరించిన చౌడమ్మతల్లికి పూజలు చేశారు. మంగళవారం చంద్రపట్నం వేసి పూజలు నిర్వహించి నిద్ర ఘట్టంలో భాగంగా కేసారం చేరిన పూజారులు బుధవారం కొత్త బోనం కుండ, గంపలో పూజా సామగ్రి, తొలిగొర్రెను తోలుకొని గట్టుకు చేరుకున్నారు. చంద్రపట్నంపై ఉన్న దేవరపెట్టె వద్ద పూజలు చేశారు. మున్న, మెంతబోయిన వంశీయులు కొత్త కుండలో బోనాలు వండారు. లింగమంతులు, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా పెట్టారు. మెంతబోయిన వంశీయులు తెచ్చిన తొలిగొర్రెను పట్నంపై బలి ఇచ్చారు. ఈ తంతు జరుగుతుండగా మరో వైపు బైకాన్ల కథలు చెప్పడంతో దేవాలయం ఉగ్రూతలూగింది. ఆ తర్వాత మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం బైకాన్లకు, మరో భాగం మున్న వంశీయులకు ఇచ్చారు. మిగిలిన భాగం మెంతనబోయిన వంశీయులు వంట చేసి ప్రసాదంగా తీసుకున్నారు. అనంతరం చంద్రపట్నం ఎత్తిపోసి సమీపంలోని నాగులమ్మ పుట్టలో పోశారు. తర్వాత చౌడమ్మ, లింగమంతుల విగ్రహాలు ఉన్న దేవరపెట్టెను తీసుకొని మెంతనబోయిన, గొర్ల వంశీయులు సూర్యాపేట మండలం కేసారం బాటపట్టారు. దీంతో నెలవారం పండుగ ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.



నెలవారం కార్యక్రమంలో భాగంగా బోనంతో వస్తున్న మున్న, మెంతబోయిన వంశస్తులు

నేడు ముగియనున్న జాతర..

నాలుగు రోజులుగా లక్షలాది భక్తుల పూజలు అందుకున్న పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర గురువారంతో ముగియనుంది. సూర్యాపేట యాదవ బజార్ నుంచి గట్టుకు తెచ్చిన మకర తోరణం గురువారం స్వస్థలానికి చేరనుంది. మకర తోరణం తీసుకువెళ్లడంతో జాతర ముగుస్తుందని యాదవ పూజారులు తెలిపారు.



భేరీలు మోగిస్తున్న యువకులు



పెద్దగట్టు పరిసరాల్లో కిక్కిరిసిన భక్తులు


స్వస్తివాచనం, విష్వక్సేనారాధన

• యాదగిరి క్షేత్రంలో ప్రారంభమైన మహా కుంభాభిషేక సంప్రోక్షణ ఉత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ప్రధానాలయంలోని ముఖ మండపంలో స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధనతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ముఖ మండపంతో పాటు గర్భాలయంలో, ఆలయ పరిసరాల్లో పుణ్యాహ వాచనం జరిపించారు. ప్రధానాలయ ముఖ మండపం నుంచి యాగశాలకు ఊరేగింపుగా శ్రీస్వామి అమ్మవార్లను ప్రత్యేక సేవపై తీసుకువచ్చారు. యాగశాల వద్ద ప్రవేశ పూజను నిర్వహించి యాగశాల మంటపం ఎదుట స్వయంభూ అగ్ని సృష్టించే కార్యక్రమం చేపట్టారు. పంచ కుండాత్మక యాగానికి అగ్ని ప్రతిష్ఠాపన చేసి హోమాది పూజలు జరిపించారు. రాత్రికి శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మూర్తి మంత్ర హోమాలుజలాధివాసం నిర్వహించనున్నారు.



స్వస్తివాచనం నిర్వహిస్తున్న అర్చకులు



కంకణధారణ చేస్తున్న అర్చకులు


భక్తులకు సదుపాయాలు కల్పించాలి

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. కొండపైన గల ఆలయ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈఓ భాస్కర్‌రావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష నిర్వహించారు.

ఉపాధ్యాయుల పరస్పర బదిలీలలు

రూ.10లక్షల నుంచి రూ.15 లక్షలకు బేరసారాలు

• జిల్లాకో రేటు చెబుతున్న ఉపాధ్యాయులు
• ఐదారు నెలల్లో రిటైర్మెంట్ అవుతున్న వారికి జాక్‌పాట్
• మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు



కోదాడకు చెందిన ఓ మహిళా ఉపాధ్యాయురాలు 317 జీఓలో నిజమాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆమె తిరిగి కోదాడకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. దీని కోసం ఆమె ఒక సరి కొత్త మార్గాన్ని ఎంచుకుంది. కోదాడ పరిసర ప్రాంతాల్లో మరో ఐదారు నెలల్లో ఉద్యోగ విరమణ చేసే వారిని సంప్రదించారు. తాను మ్యూచ్‌వల్ మీద కోదాడకు వస్తానని, మీరు నిజామాబాద్ వెళితే రూ.15లక్షలు ఇస్తానని ఆఫర్ చేశారు. దీనికి సదరు ఉపాధ్యాయుడు ఓకే చెప్పడంతో ఆయన నిజమాబాద్‌కు, ఆమె కోదాడకు రావడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కోదాడ మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో మరో ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయుడు మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేస్తున్న మహిళ ఉపాధ్యాయురాలికి పరస్పర బదిలీ ఇవ్వడానికి అంగీకరించారు. దీని కోసం ఆయన ఏడు లక్షల రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు

ఇలా కోదాడతో పాటు జిల్లా వ్యాప్తంగా ఈ తంతు జోరుగా సాగుతోంది.

కోదాడ: ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు ప్రభుత్వం కల్పించిన అవకాశం కొందరికి కాసులు కురిపిస్తోంది. దూరప్రాంతాల్లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు సొంత ప్రాంతానికి రావడానికి లక్షల రూపాయలు ఇస్తామంటూ ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బేరసారాలకు కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలే మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు.

రెండు నెలలు ఇబ్బంది పడితే..

ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఈ సంవత్సరం జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుంది. ఆ తరువాత వేసవి సెలవులు వస్తాయి. పాఠశాలలు తిరిగి జూన్‌లో తెరుస్తారు. అప్పటి వరకు వీరు ఉద్యోగ విరమణ చేస్తారు. కాబట్టి మార్చి, ఏప్రిల్ రెండు నెలల పాటు కొంత ఇబ్బంది పడితే లక్షల ఆదాయం వస్తుందని పలువురు ఈ స్కీంకు ఒప్పుకుంటున్నట్లు సమాచారం. ఇక పోతే కొందరు అక్కడ జాయిన్ అయిన తరువాత సెలవు పెట్టి ఇంటి దగ్గర ఉంటే సరిపోతుందని, రిటైర్‌మెంట్ వారం ఉందనగా తిరిగి విధుల్లో చేరితే సరిపోతుందని చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయ సంఘాల నేతలకు కమీషన్‌లు

జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులను గుర్తించి వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా దూర ప్రాంతాల్లో ఉన్న మహిళ ఉపాధ్యాయులతో పరస్పర బదీలలకు ఒప్పించడానికి కొన్ని ఉపాద్యాయసంఘాల నేతలు రంగంలోకి దిగారు. దీని కోసం వారు ఇరువైపుల భారీగా కమీషన్‌లు వసూలు చేస్తున్నట్లు కొందరు టీచర్లే ఆరోపిస్తున్నారు. పది లక్షల రూపాయలకు బేరం కుదిర్చితే ఇరువైపులా రూ.లక్ష చొప్పున రెండు లక్షల రూపాయలను కమీషన్‌గా తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో ఈబదిలీలుకు బ్రేక్ పడింది. కోడ్ ముగియగానే ఈ జాక్‌పాట్ బదిలీలు మరింత ఊపందుకునే అవకాశం ఉందని కొందరు టీచర్లు అంటున్నారు.



పెద్దగట్టు జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు



బోనం వండుతున్న మున్న, మెంతబోయిన వంశస్తులు



స్వామి వారికి బోనం సమర్పించేందుకు వస్తున్న భక్తులు



క్యూ లైన్‌లో కిక్కిరిసిన భక్తులు

క్లుప్తంగా

348 మంది దాతలకు ఆహ్వానం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపురానికి మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి హాజరుకావాలని 348 మంది దాతలకు ఆహ్వానం పంపినట్లు ఈఓ భాస్కర్‌రావు బుధవారం వెల్లడించారు. దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం కోసం బంగారం, నగదుతో పాటు చెక్కులను అందజేసిన దాతలందరినీ ఈ మహోత్సవానికి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. 23వ తేదీన నిర్వహించే ఈ వేడుకకు వచ్చే దాతలందరికీ తూర్పు మాడ వీధిలోని కల్యాణ మండపం వద్ద కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాతలందరికి సన్మానించి, స్వామి వారి ప్రసాదం అందజేస్తామని ఈఓ పేర్కొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

- కోదాడ పట్టణంలోని ప్రైవేట్ నర్సింగ్ హోంలో ఘటన

కోదాడ: వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కోదాడ పట్టణంలోని ఓ నర్సింగ్ హోంంలో బుధవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డకు చెందిన గూడెపు నాగేశ్వరరావు(48) దగ్గుతో బాధపడుతూ బుధవారం చికిత్స నిమిత్తం తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కోదాడ పట్టణంలోని శ్యామల నర్సింగ్ హోంకు వచ్చారు. అతడిని డాక్టర్ పరిశీలించి ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది నాగేశ్వరరావును అడ్మిట్ చేయించుకుని వైద్యం చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత అతడి పరిస్థితి విషమంగా ఉందని సాయంత్రం హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డులో ఉన్న మరో వైద్యశాలకు తరలించగా అక్కడ మృతిచెందాడు. శ్యామల నర్సింగ్ హోం సిబ్బంది ఓవర్ డోస్ ఇంజక్షన్ ఇవ్వడంతోనే నాగేశ్వరరావు మృతి చెందాడని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా చేసేందుకు కుటంబ సభ్యులు, బంధువులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

రూ.70కోట్లతో పెద్దగట్టు అభివృద్ధి చేస్తాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- లింగమంతుల స్వామికి పూజలు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కంకణం కడుతున్న ఆలయ కమిటీ సభ్యులు, పక్కన ఎమ్మెల్యే వీరేశం

చివ్వెంల: చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో గల పెద్దగట్టు లింగమంతులస్వామి ఆలయాన్ని రూ.70 కోట్లతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పెద్దగట్టు జాతరకు మంత్రి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దగట్టు ఆలయం వద్దకు ఘాట్ రోడ్డుతో పాటు శాశ్వత గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తామని, భక్తుల కోసం గుడి వద్ద వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ కాలువలు తవ్వించారని అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు త్వరలో పూర్తిచేసి ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఎప్పుడూ పెద్దగట్టు జాతరకు రాలేదని, ఇప్పుడు వచ్చి పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరో ఇరవై ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ మతంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఓట్లు గాని సీట్లు గాని వచ్చే పరిస్థితి లేదన్నారు. తమ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఆలేరు, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, ఆలయ చైర్మన్ నర్సయ్యయాదవ్ పాల్గొన్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

- ఐసీఎస్ఎస్ఆర్–హైదరాబాద్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): సుస్థిర అభివృద్ధి సాధిస్తూ, సమస్యలను అధిగమిస్తూ భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్)–హైదరాబాద్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసీఎస్ఎస్ఆర్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో కళాశాల సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన 'సుస్థిర అభివృద్ధి–భారతదేశంలో అవకాశాలు మరియు సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన నేషనల్ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సెమినార్లు నిర్వహించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మరొక అతిథి ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలో పేదరికం, అసమానతలను అంతంచేసేలా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సుస్థిర అభివృద్ధిపై పలువురు పరిశోధనా పత్రాలను సమర్పించారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఎకనామిక్స్ హెడ్ ప్రొఫెసర్ ఫరీదా బేగం, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ ఆకుమార్తి నాగేశ్వరరావు, ప్రొఫెసర్ మల్లయ్య, ప్రొఫెసర్ ఎం. రాములు, బిఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ బి. మునిస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆది మల్లేశం, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరలో పోలీస్ బందోబస్తు భేష్

- మల్టీజోన్–2 ఐజీ వి. సత్యనారాయణ



లింగమంతుల స్వామికి మొక్కుతున్న ఐజీ సత్యనారాయణ, పక్కన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్: దురాజ్‌పల్లి లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో పోలీసులు బందోబస్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నారని మల్టీజోన్–2 ఐజీ వి. సత్యనారాయణ అన్నారు. బుధవారం లింగమంతులస్వామిని ఆయన దర్శంచుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారని కితాబిచ్చారు. సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జాతర పరిసరాలను పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టంగా అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి జాతరలో దొంగతనాలు జరగకుండా నివారించారని తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపునకు సహకరించిన వాహనదారులు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐలు రాజశేఖర్, వీరరాఘవులు, స్థానిక ఎస్ఐ మహేశ్వర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


పందెంరాయుళ్లపై కేసు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్న 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ బుధవారం విలేకరులకు తెలిపారు. బహిరంగంగా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి ఆరుగురిని పట్టుకోగా.. మరో ఇద్దరు పరారైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4వేల నగదు, 6 మోటారు సైకిళ్లు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అజీంపేటలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

అడ్డగూడూరు: మండలంలోని అజీంపేట గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. అజీంపేటకు చెందిన పండుగ రాజమల్లు మృతికి అదే గ్రామానికి చెందిన భట్ట లింగయ్యనే కారణమని రాజమల్లు కుమారుడు రామస్వామి కక్ష పెంచుకున్నాడు. 2017 దసరా రోజు భట్ట లింగయ్య గ్రామంలో జమ్మి పూజ వద్దకు రాగా.. రామస్వామితో సహా మరో 17 మంది గ్రామస్తులతో కలిసి మూకుమ్మడిగా అతడిపై దాడి చేశారు. చికిత్స నిమిత్తం లింగయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లింగయ్య కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రామస్వామితో పాటు 17మందిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడో అదనపు జడ్జి జడ్జీ రోజారమణి 18మందికి జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. వీరిలో జక్కుల భిక్షమయ్య గతంలోనే మృతిచెందగా.. మిగతా 17 మందిని నల్లగొండ జైలుకు తరలించారు. అజీంపేటలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా బుధవారం కూడా పోలీసు పికెట్ కొనసాగించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

యాదగిరిగుట్టలో వైభవంగా గిరి ప్రదక్షిణ



ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం భక్తులు, ఆలయాధికారులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఉదయం 5గంటలకు కొండ కింద గల వైకుంఠ ద్వారం వద్ద ఈఓ భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తిలు ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అంతకుముందు కూచిపూడి, భరతనాట్యంతో కళాకారులు భక్తులను ఆకట్టుకున్నారు. ఆలయంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేపట్టారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వర్ణ దివ్య విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆలయ సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. సాయంత్రం విజయవాడకు చెందిన ఎంవీ సుధాకర్‌చే కర్ణాటక సంగీతం, రాత్రి హైదరాబాద్‌కు చెందిన శాంకరి కూచిపూడి నృత్యం వారు, ఇందిరా కళానికేతన్ మహతి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.





నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి ఢీకొన్న రెండు కార్లు
- ఇద్దరు మృతి.. మరో ఐదుగురికి గాయాలు
- మృతుల్లో 7 నెలల పసికందు
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద ఘటన



సాయికుమార్ మృతదేహం



విరాంచ్ మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్ కుటుంబ సభ్యులు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తితో పాటు 7 నెలల పసికందు మృతిచెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన సుంకి సాయికుమార్(35), తన భార్య సింధూజ, కుమారుడు విరాంచ్(7 నెలలు)తో కలిసి హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సాయికుమార్ బుధవారం సాయంత్రం భార్య, కుమారుడితో పాటు తన తల్లిదండ్రులతో కలిసి పటాన్‌చెరు నుంచి కారులో సూర్యాపేటకు వెళ్తున్నాడు. అద ఏ సమయంలో నల్లగొండలోని గోకుల్ బీఈడీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న నల్లగొండకు చెందిన జె. సందీప్‌రెడ్డి, తన భార్య పద్మతో కలిసి నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నాడు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే సందీప్‌రెడ్డి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి హైదరాబాద్ నుంచి విజయవాడ రూట్‌లో వస్తున్న సాయికుమార్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్‌తో పాటు అతడి కుమారుడు విరాంచ్ అక్కడికక్కడే మృతి చెందారు. సాయికుమార్ తండ్రి వెంకన్న, తల్లి విజయ, భార్య సింధూజ తీవ్రంగా గాయపడ్డారు. జె. సందీప్‌రెడ్డి, అతడి భార్య పద్మకు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్లను హైవే పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఐదుగురిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చౌటుప్పల్ సీఐ జి. మన్మథకుమార్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



మిర్యాలగూడలో రాస్తారోకో చేస్తున్న ఎంసీపీఐయూ నేతలు

మిర్యాలగూడ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కేంద్ర బడ్జెట్ అనుకూలంగా ఉందని, పేదలకు, రైతులకు, కార్మికులకు, కూలీలకు, మహిళలకు, విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందన్నారు. రాష్ట్రంలో 8మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, వనం సుధాకర్, పెద్దారపు రమేష్, నజీర్, సైదమ్మ, కాశీ, ప్రతాప్, రాగసుధ, సంధ్య, సావిత్రి, వెంకన్న, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

Wanted

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

NAME CHANGE

■ యానక లక్ష్మీప్రియ D/o యానక ప్రతాప్ H.No: 2-12/2, గ్రా॥ పెద్దదేవులపల్లి, మం॥ త్రిపురారం, జిల్లా॥ నల్లగొండ అను నేను నా యొక్క పేరును యానక ప్రియాన్షగా పేరు మార్చుకోవడం జరిగింది. గమనించగలరు. సెల్: 9966424111 [SCA25001782]

■ శ్రీబాలాజీ హోంకేర్: Hydలో సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/వంట పనికి (స్త్రీ/పు) కావలెను. జీ: 18000/- రూం+మీల్స్ ఫ్రీ. ✆ 95731 83331 [G-1940]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కబడ్డీ అసోసియేషన్‌లో విభేదాలు

- జిల్లా అసోసియేషన్ ఎన్నికలే జరగలేదంటున్న ఒక వర్గం
- నూతన కార్యవర్గం మాదే అంటున్న మరో వర్గం
- మంత్రి వద్దకు చేరిన పంచాయితీ

కోదాడ: జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికపై తీవ్ర గందరగోళం ఏర్పడింది. క్రీడాకారులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. కార్యవర్గ ఎన్నిక జరిగిందని ఓ వర్గం, జరగలేదని మరో వర్గం వాదించుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై మంత్రి ఉత్తమ్‌కు కొందరు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని ప్రస్తుత అడహక్ కమిటీని ఆయన ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఈ నెల 17న ప్రకటించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రస్తుత జిల్లా కబడ్డీ అసోసియేషన్ అడహక్ కమిటీ చైర్మన్ భూలోకరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశాడు.

అసలేం జరిగిందంటే...

ప్రస్తుతం జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు కార్యవర్గం లేదు. భూలోకరావు అధ్యక్షుడిగా అడహక్ కమిటీ పని చేస్తుంది. ఈ నెల 16న కోదాడలోని ఎంఎస్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించడానికి నిర్ణయించారు. నామినేషన్‌ల స్వీకరణ అనంతరం కొందరికి అర్హత లేదని నామినేషన్లు తిరస్కరించడంతో వివాదం మొదలైంది. ఎన్నికలను హుజూర్‌నగర్‌లో నిర్వహించి అక్కడే నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా అల్లం ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శిగా నామనాగేశ్వరరావులు ఎంపికైనట్లు రిటర్నింగ్ అధికారి సాముల రామిరెడ్డి ప్రకటించిఈ విషయాన్ని రాష్ట్ర కమిటీకి పంపారు. కొంత మంది వ్యతిరేకించడంతో అడహక్ కమిటీ చైర్మన్ భూలోకరావు ఈ ఎన్నిక చెల్లదని ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకే ఎన్నికలు జరిగాయని నూతన అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు తెలిపారు. ఎన్నికల తరువాత అడహక్ కమిటీకి, దాని అధ్యక్షుడికి ఎటువంటి అధికారం ఉండదన్నారు. అడహక్ కమిటీలో నలుగురు సభ్యులుండగా ఒక్కడే రద్దు ప్రకటన జారీ చేయడం చెల్లదన్నారు.

రైతును వెంబడించి నగదు చోరీ

- ధాన్యం అమ్మి డబ్బు తీసుకొస్తుండగా దాడి చేసి అపహరించిన దుండగులు
- అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో ఘటన



బాధితుడు పుల్లయ్య

అనంతగిరి: ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బుతో ఓ రైతు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా దుండగులు ఆ రైతును వెంబడించి అతడిపై దాడి చేసి రూ.1,77,817 నగదు ఎత్తుకెళ్లారు. అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో జరిగిన ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామానికి చెందిన రైతు కొండబాల పుల్లయ్య సోమవారం తాను పండించిన వరి ధాన్యాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన ఓ వ్యాపారికి విక్రయించాడు. మంగళవారం ఉదయం నగదు తీసుకువెళ్లాంటూ సదరు ధాన్యం వ్యాపారి నుంచి ఫోన్ రావడంతో పుల్లయ్య నేలకొండపల్లి వెళ్లి నగదు తీసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో అనంతగిరి మండలం శాంతినగర్ శివారులోని సర్వీస్ రోడ్డులో గల రైస్ మిల్లు వద్దకు చేరుకోగానే స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు పుల్లయ్యను ఆపే ప్రయత్నం చేశారు. వారిపై అనుమానం వచ్చిన పుల్లయ్య ద్విచక్ర వాహనం వేగం పెంచగా.. కొద్దిదూరం వెళ్లాక పుల్లయ్య అడ్డగించారు. దీంతో పుల్లయ్య డబ్బులు ఉన్న ప్లాస్టిక్ కవర్‌తో సహా పారిపోతుండగా.. ముగ్గురు దుండగులు అతడిపై దాడి చేసి నగదు ఉన్న కవరును లాక్కొని పారిపోయారు. పుల్లయ్య విలపిస్తూ అటుగా వస్తున్న ఓ కారుకు ఎదురుగా వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. యూటర్న్ చేసుకుని పారిపోతున్న దుండగులను కారులోని వ్యక్తి ఆపే ప్రయత్నం చేసినప్పటికీ వారు తప్పించుకుపోయారు. బాధితుడు అనంతగిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి తెలిపారు.

బైక్ ట్యాంకు కవర్‌లో నుంచి రూ.2లక్షలు అపహరణ

హాలియా: బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన రూ.2లక్షల నగదును దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన హాలియా పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం తెప్పలమడుగుకు చెందిన కొండల్ బైక్‌పై బుధవారం హాలియాలోని ఎస్‌బీఐలో నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. రూ.2లక్షల నగదు డ్రా చేసి కవర్‌లో పెట్టి తన బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టాడు. దేవరకొండ రోడ్డులోని వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపు వద్ద బైక్‌ను నిలిపి షాపులోకి వెళ్లి వచ్చేసరికి బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి నగదు చోరీ చేసి సాగర్ వైపు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.



సీసీ ఫుటేజీలో అనుమానితుల దృశ్యాలు